
ధరల మంట



కూరగాయల ధరలు ఆకాశం వైపు చూస్తున్నాయి. పప్పుల ధరలు పైపైకి ఎగకబాకుతున్నాయి. వీటి ధరలు ప్రజల జేబుకు గాయాలు చేస్తున్నాయి. ఇలా ధరలు ఉంటే ఏం కొంటాం. ఏం తింటామని సామాన్య, మధ్య తరగతి ప్రజలు వాపోతున్నారు. రూ.500 నోటు తీసుకుని మార్కెట్‌కు వెళ్తే కనీసం నాలుగు రోజులకు సరిపడా కూరగాయలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు ఇంతలా పెరిగినా ప్రభుత్వం కనీసం సమీక్షించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

\- పెదగంట్యాడ



- కొండెక్కిన కూరగాయల ధరలు
- వండక ముందే పప్పు కుతకుత
- కొనలేం.. తినలేమంటున్న ప్రజలు

మార్కెట్‌లో అన్ని రకాల కూరగాయలు ధరలు పెరిగాయి. సరిగ్గా వర్షాలు కురవకపోవడంతో కొత్త వంటల సాగు ప్రారంభం కాలేదని.. మిర్చి, క్యారెట్, బీట్‌రూట్, బీన్స్, క్యాబేజీ, క్యాప్సికం తదితర కూరగాయాలన్నీ బయట రాష్ట్రం నుంచి దిగుమతి అవుతుండడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. 20 రోజల వ్యవధిలోనే కూరగాయల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. మొన్నటి జూన్ నెల అంతా ప్రతి కుటుంబంలో విద్యార్థుల ఫీజులు, పుస్తకాలు తల్లిదండ్రులకు అదనపు ఖర్చు కాగా.. జూలై నెలలో కూరగాయాల ధరలు పెరిగిపోవడంతో పేదలకు బతుకు మరింత భారంగా మారింది. పచ్చిమిర్చి, అల్లం, క్యాబేజీ, కాకర. కూరగాయలతో పాటు ఆకుకూరలు తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర ధరలు పెరుగుతున్నాయి. పప్పుల ధరలు పెరగడంతో ప్రజలు అటువైపు చూడడం లేదు.

బయట మార్కెట్‌లో మరీ దారుణం

రైతు బజారులో కంటే బహిరంగ మార్కెట్‌లో ధరలు మరీ ఎక్కువగా ఉన్నాయి. బయట మార్కెట్ ధరలు కిలోకి రూ. 20 నుంచి రూ.40 వరకూ తేడా ఉండండతో రైతు బజార్లనే ఆశ్రయిస్తున్నారు.

ఆకుకూరలదీ అదే దారి

ఎప్పుడూ లేని విధంగా ఆకుకూరలు ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో రూ.10 మూడు కట్టలు ఇచ్చే తోటకూర ప్రస్తుతం కట్ట రూ.10కి అమ్ముతున్నారు. ఇలా గోంగూర, చుక్క కూర వంటి ప్రతి ఆకుకూర ధరలు విపరీతంగా పెరిగాయి.

తగ్గిన దిగుబడి.. దిగుమతి

రాష్ట్రంలో పంట దిగుబడి తగ్గడం.. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి కూడా తగ్గడంతో ధరలు బాగా పెరుగుతున్నాయని అధికారులు, వ్యాపారలు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ధరల అదుపునకు చర్యలు తీసుకేని పేదలకు మేలు చేయాలని కోరుతున్నారు.



విక్రయానికి సిద్ధంగా కూరగాయలు

20 రోజుల కిందట ధరలు ఇలా.. (కిలో)

కూరగాయలు	రైతు బజారు(రూ.)	బయట మార్కెట్(రూ.)
క్యారెట్	30	40
క్యాప్సికం	60	80
బీన్స్	48	60
బెండకాయలు	18	40
దొండకాయలు	20	40
దేముడు చిక్కుడు	65	80

ప్రస్తుతం రైతుబజారు, బయట మార్కెట్‌లో ధరలు

కూరగాయి రకం	రైతు బజారు(రూ.)	బయట మార్కెట్ (రూ.)
క్యారెట్	48	60
క్యాప్సికం	84	120
బీన్స్	100	140
బెండకాయలు	32	55
దొండకాయలు	38	55
దేముడు చిక్కుడు	84	120

ఏం తినాలి. ఎలా బతకాలి



ఉక్కు నిర్వాసితులమైన మేం స్టీల్‌ప్లాంట్‌లో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇటీవల కాలంలో మమ్మల్ని పనుల నుంచి తొలగించి ఉపాధి లేకుండా చేశారు. పిల్లలను చదువులు మాన్పించే పరిస్థితి నెలకుంది. దీంతో పాటు అన్ని ధరలు పెరిగిపోవడంతో ఏమీ కొనలేక పోతున్నాం. ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. పిల్లల్ని ఎలా పోషించాలి. మేం ఎలా బతకాలి. ప్రభుత్వం ధరలు అరికట్టే విధంగా చర్యలు తీసుకుని పేద ప్రజలను కాపాడాలని కోరుతున్నాం.

\- ధర్మాల తవుడమ్మ, నెల్లిముక్కు, పెదగంట్యాడ

కొనుగోలు శక్తి తగ్గింది



మునుపెన్నడూ లేని విధంగా మార్కెట్‌లో నిత్యావసర ధరలతో పాటు కూరగాయల ధరలు బాగా పెరిగిపోయాయి. గతంలో వారానికి కూరగాయాల కోసం రూ. 100 నుంచి 150 వరకూ ఖర్చు అయ్యేది. ప్రస్తుతం రూ. 500 పెట్టినా సరిపోవడం లేదు. వారంలో రెండు నుంచి మూడు రోజులు ఆకుకూరలతోనే సరిపెట్టుకుంటున్నాం. సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ధరలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.ఉక్కు నిర్వాసిత కాలనీల్లో స్టీల్‌ప్లాంట్‌లో పనులు తొలగించడంతో చాలా కుటుంబాలు పూట గడవని స్థితిలో ఉన్నాయి.

\- దాసరి పెంటమ్మ, పెదగంట్యాడ

సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఈఈ బి.కె.నాయుడు

గాజువాక: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంద్వారా వివిధ ప్రయోజనాలు పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు అన్నారు. సోలార్ విద్యుత్ ప్రయోజనాలపై శ్రీనగర్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా బ్యాంకు నుంచి రూ.78 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈ పథకంలో బీసీలకు అదనంగా మరో రూ.20వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఈ పథకాన్ని పూర్తిగా ఉచితంగా పొందవచ్చన్నారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంవల్ల వినియోగదారుల విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు, ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ పదవి అగనంపూడికి కేటాయించాలి

అగనంపూడి: లంకెలపాలెంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పదవిని అగనంపూడి ప్రాంతానికి చెందిన నాయకులకు ఇవ్వాలని అగనంపూడికి చెందిన పీఏసీఎస్ సభ్యులు కోరారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో నాయకులు బి.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గం పరిధిలో మూడు పీఏసీఎస్‌లు ఉన్నాయని, రెండింటిని ఆ నియోజకవర్గ పరిధిలోని నాయకులకు కేటాయించి, లంకెలపాలెం అధ్యక్ష పదవి మాత్రం ఈ ప్రాంతానికే కేటాయించాలని వారు కోరారు. అగనంపూడి, ఫార్మాసిటీ, దువ్వాడ ప్రాంతాలకు చెందిన సభ్యులు ఉన్నారని, వీరిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిశీలన



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఈఈ రవి

కూర్మన్నపాలెం: వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను శనివారం జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం ఇ.ఇ కె.వి.ఎస్.రవి పరిశీలించారు. ఆయనకు కార్పొరేటర్ బి.జగన్ సమస్యలను వివరించారు. వార్డులోని వివిధ ప్రాంతాల ప్రజలకు 12ఎంఎల్‌డీ ద్వారా మంచినీరు అందిస్తున్నామన్నారు. అయితే అపార్టుమెంట్‌లు, ఇతర నిర్మాణాలు పెరగడం వల్ల మంచినీరు సరిపోవడం లేదని... మరో 12ఎంఎల్‌డీ మంచినీటి శుద్ధి చేసే ప్లాంట్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు పి.ఎస్.ప్రసాద్, బి.డి.శ్రీనివాస్, కేదారినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్‌కు పోలీస్ బృందం

ఉక్కునగరం: ఇటీవల స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ఐదు క్వార్టర్లలో జరిగిన చోరీ కేసు కొలిక్కి వస్తోంది. ఈ చోరీలకు సంబంధించిన దొంగలను పోలీసులు గుర్తించారు. ఈ నెల 6వ తేదీ రాత్రి దొంగలు ఒకే సెక్టార్‌లో ఐదు క్వార్టర్లలో ప్రవేశించి నగదు, బంగారం, వెండి, ద్విచక్ర వాహనం చోరీ చేసిన విషయం విధితమే. ఈ సంఘటనలపై అందిన ఫిర్యాదు మేరకు గాజువాక క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో చోరీలకు పాల్పడింది రాజస్థాన్‌లోని ధార్ జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులుగా అనుమానిస్తున్నారు. దొంగతనం చేసిన వెంటనే వారు ఇక్కడ నుంచి పరారయ్యారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ధార్ జిల్లాకు పంపారు. చోరీకు పాల్పడిన వారిని త్వరలోనే అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ఆర్‌ఎంపీల సేవలు విస్తృతం



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభాకరరావు

గాజువాక: సమాజంలో ఆర్‌ఎంపీల సేవలను మరింత విస్తృతం చేయాలని గాజువాక పారామెడిక్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకరరావు అన్నారు. ఆర్‌ఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారని తెలిపారు. ఆటోనగర్‌లో శనివారం నిర్వహించిన సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యుల వృత్తి భద్రత, శిక్షణపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు తంగుడు రామారావు, ఎస్.వరప్రసాద్, సీపాల గోవిందరావు, ఒమ్మి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో చేటు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బారాలు మోపుతోందని. ఇప్పటికే నాలుగుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి రామచంద్రనగర్,. రిక్షా కాలనీలో శనివారం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంపు, స్మార్ట్ మీటర్ల అమలు, అదానీ ఒప్పందాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరట ఇప్పటికే కోట్ల రూపాయలు భారం ప్రజలపై మోపారన్నారు. గృహ వినియోగదారులకు బలవంతంగా స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవరిస్తోందని విమర్శించారు. ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీల పెంపును, స్మార్ట్ మీటర్ల అమలును తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. తక్షణమే విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు అమలు రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి. రమణ, బి. రమణ, రాజారావు, సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీలన్నీ మోసాలు, వెన్నుపోట్లే

- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి
- ఉత్సాహంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం



అగనంపూడిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి



66వ వార్డులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక/అగనంపూడి : చంద్రబాబు ప్రజలకు ఎన్ని హామీలిచ్చినా అమల్లో మాత్రం మోసాలు, వెన్నుపోట్లు తప్పవని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి అన్నారు. 70, 66వ వార్డులతో పాటు 85వ వార్డు అగనంపూడి సీడబ్ల్యూసీలో, 79వ వార్డు శనివాడలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో ఖరీదైన భూములన్నీ 99 పైసలకు అమ్మేస్తున్నారన్నారు. ఇదే బాబు ష్యూరిటీ అని ఎద్దేవా చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు దాని గురించి పట్టించుకోవడంలేదన్నారు. బాబు ష్యూరిటీ స్టీల్‌ప్లాంట్ అమ్మేయడం గ్యారెంటీ అనేలా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో లక్షా యాభైవేల కోట్ల రూపాయల అప్పు చేసి విజయవాడలో నీరు తోడుకొంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఎలా ఉంటాయో గడిచిన ఐదేళ్లలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. బాబు పాలన అంతా నయ వంచన, దగాకోరుతనమేనని మండిపడ్డారు. కార్యక్రమంలో 70వ కార్పొరేటర్ ఉరుకూటి చందు, నాయకులు నాయకులు కొణతాల రాము, పాలఘాట్ కృష్ణ, నాయుడు, 66వ వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్, నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, గూన శ్రీనివాసరావు, పేరం రామకృష్ణారెడ్డి, దుబాయ్ బాషా, ఉమాదేవి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డు వైఎస్సార్‌సీపీఅధ్యక్షుడు గున్నంటి పూర్ణానందశర్మ (పూర్ణ) ,పార్టీ సీనియర్ నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, నక్కా రమణబాబు, కొలిపాక అప్పారావు, యలమంచిలి చిన అప్పారావు, పెదిరెడ్ల హరీష్, బోర సోమునాయుడు, బలిరెడ్డి శ్రీను, దాసరి సత్యవేణి, సేనాపతి నరసింగరావు, గెద్దాడ అప్పలరాజు, దాములోతు అప్పలరాజు, యలమంచిలి వరహా వెంకటరావు, పట్టా రామకృష్ణ, విందుల వరప్రసాద్ పాల్గొన్నారు.

\- 79వ వార్డులో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అప్పికొండ మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు గుర్రం శ్రీను, మామిడి శ్రీను, సోమునాయుడు, పండూరి రాజు, కనకరాజు, ప్రసాదరాజు, గళ్ల కిరణ్, నెల్లి శ్రీనమ్మ, లక్ష్మీ ప్రసన్న, ఆనందరావు, రవిచంద్రా రెడ్డి, రామారావు, గుర్రం కిషోర్, మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు.



70వ వార్డులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు



79వ వార్డు శనివాడ కూడలి బాబు హామీలను ప్రదర్శిస్తున్న దేవన్‌రెడ్డి

భూమి కోసం ఇరువర్గాల ఘర్షణ



వివాదాస్పద స్థలంలో ఘర్షణ పడుతున్న దృశ్యం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలో జాతీయ రహదారికి సమీపంలో సుమారు 1.40 ఎకరాల భూమి మాదే అంటే మాది అని రెండు వర్గాల వారు పట్టు బడుతూ స్థలంలో గొడవపడ్డారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు రప్పించి సర్దిచెప్పారు. సర్వేనెంబర్ 123–1లోని సుమారు 1.40 ఎకరాల భూమిని కడంశెట్టి అప్పలరాజు ఆయన సోదరులు 1983లో భీమిలి సన్యాసయ్య దగ్గర కొనుగోలు చేశారు. అయితే ఆ భూమి అప్పటి నుంచి ఖాళీగా ఉంది. ఇటీవల సన్యాసయ్య వారసులు ఆ భూమిని చదును చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో కడింశెట్టి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో ఇరువర్గాల వారిని తమకు సంబంధించిన డాక్యుమెంట్‌లు పట్టుకొని రావాలని సూచించారు. అయితే కడిశెట్టి వర్గం శనివారం పనులు ప్రాంభించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకొంది.దీంతో యుద్ధ వాతావరణం నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకొని రెండు పార్టీలను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరువర్గాల వారు ససేమీర అనడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఈ వివాదంలో కొంతమంది పెద్దల జోక్యం ఉండడంతో ఎటూ చెప్పలేని పరిస్థితి నెలకొంది.

పందుల బెడద

నిర్లక్ష్యం వహిస్తున్న జీవీఎంసీ అధికారులు



75వ వార్డు సీతానగరం ఏడు గుళ్లు సమీపంలో పందులు



74వ వార్డు ఎంపీపీ పాఠశాల సమీపంలో పందులు



73వ వార్డు వుడా కాలనీ ప్రధాన రహదారిలో..

పెదగంట్యాడ: జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో ప్రజలకు శాపంగా మారింది. ఎన్నడూ లేని విధంగా పందుల బెడద అధికంగా ఉండడంతో ప్రజలు భయపడుతున్నారు. వ్యాధుల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడేళ్ల కిందట ఇలాంటి సమస్య వస్తే అప్పటి నాయకులు, అధికారుల చొరవతో పందులను సమూలంగా తరలించి మండల వాసులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పందుల బెడద మళ్లీ పెరిగింది. పలుమార్లు వినతపత్రాలు అందజేసినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. పందులను కుట్టిన దోమలు మనుషలను కుడితే మెదడువాపు వ్యాధి వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కుటుంబం చెంతకు తప్పిపోయిన వృద్ధురాలు



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు

పెదగంట్యాడ: తప్పిబోయిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు న్యూపోర్టు పోలీసులు శనివారం అప్పగించారు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 76వ వార్డు బర్మాకాలనీలో శనివారం సాయంత్రం వృద్ధురాలు తప్పిపోయి తిరుగుతుండగా స్థానికులు 112కి సమాచారం అందించారు. దీంతో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు వెంటనే వృద్ధురాలు సింహాద్రి చెల్లయ్యమ్మను న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఆమె ఫొటోను సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో శ్రీనగర్‌కు చెందిన కుటుంబ సభ్యులు న్యూ పోర్టు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తమ బామ్మ అని చెప్పడంతో ఆమె మనవడి వద్ద వివరాలు నమోదు చేసుకొని అప్పగించారు.

ముగ్గురు యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన యువకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ముగ్గురు యువకులు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డ్స్ ప్రాణాలు కాపాడిన సంఘటన చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన ఐదుగురు యువకులు శనివారం సాయంత్రం రుషికొండ బీచ్‌కు వచ్చారు. కాసేపు సరదాగా గడిపిన అనంతరం స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో బి.శ్రీనివాసరావు, ఎం.రామ్, ఎ.శివ కొట్టుకుని పోతుండటంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, ఎం.అమ్మోరు చిన్నప్పన్న, గురుమూర్తి, జి.దేవ గుర్తించారు. వారిని రక్షించి, తీరానికి తీసుకువచ్చారు. వారికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. లైఫ్‌గార్డ్స్ ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

ఘనంగా పాపాహోం రజతోత్సవం

డాబాగార్డెన్స్: పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ ప్రాంగణంలో నడుస్తున్న పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) 25వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్, పాపాహోమ్ చైర్మన్ శంఖబ్రత బాగ్చీ, హోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పాపాహోమ్ కమిటీ, విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పాపాహోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వివిధ కారణలచే నిరాదారణకు గురైన బాల బాలికలను చేరదీసి, వారిని బాగు చేస్తే మంచి భవిష్యత్ కలిగి చక్కగా జీవిస్తారని, తద్వారా స్థిరపడతారని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) డాక్టర్ అజిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్. రాధ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ అస్లాం ఆరీఫ్, రాజగోపాలరాజు, ఉపాధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, కార్యదర్శి ప్రకాశరావు పాల్గొన్నారు.

26 మద్యం బాటిళ్ల పట్టివేత

మల్కాపురం: జీవీఎంసీ62వ వార్డు దుర్గనగర్ ప్రాంతంలో ఇద్ద రు వ్యక్తులు తమ ఇళ్లల్లో రహస్యంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో రెండు బృందాలు మద్యం విక్రయిస్తున్న ఇళ్లపై దాడులు చేశారు. ఇద్దరి నుంచి సుమారు 26 బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.